క్లుప్తంగా

పెద్దాసుపత్రిలో సెక్యూరిటీ గార్డుల సస్పెన్షన్

కర్నూలు(హాస్పిటల్): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సెక్యూరిటీ గార్డులను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి సస్పెండ్ చేశారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులపై విధి నిర్వహణలో ఉండే ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది అంబులెన్స్ వచ్చినా కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఛాంబర్‌లోని సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేసి బాధ్యులైన కృపాకర్, షేక్షావలి, కుమార్‌లను ఐదు రోజుల పాటు సస్పెండ్ చేస్తూ ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేశారు. ఏఎంసీ, క్యాజువాలిటీ, గైనిక్ విభాగాల్లో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి రద్దీ ఉండే ప్రదేశాల్లో నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నీటి కుంటగా లక్ష్మీనగర్

కర్నూలు(సెంట్రల్): నగర కార్పొరేషన్ పరిధిలోని 24వ వార్డు లక్ష్మీనగర్ నీటి కుంటను తలపిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం బృందం వార్డులో నిలిచిన నీటిని పరిశీలించింది. నీరు ఎక్కడికి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లు కుంటలుగా మారుతున్నాయని, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, శేషాద్రి, ఎల్లగువేర పాల్గొన్నారు.

పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని వివిధ పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని చాణిక్యపురి, వినాయకఘాట్, గాయత్రీ ఎస్టేట్, కోట్ల రైల్వే స్టేషన్ల సమీపంలో ఉన్న పార్కులను ఏఐవైఎఫ్ నాయకులు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా పార్కుల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో వాకింగ్ చేయడానికి ఇబ్బందిగా ఉందన్నారు. మరికొన్ని పార్కులు మందు బాబులకు అడ్డాగా మారాయని చెప్పారు.


ప్రేరణ తరగతులు ఉపయోగం

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు చదువులో రాణించేందుకు మోటివేషన్(ప్రేరణ) తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్థానిక మౌర్య ఇన్‌లోని మంత్రి కార్యాలయంలో హిప్నో థెరపిస్ట్ సిరిగిరెడ్డి జయరెడ్డి నిర్వహిస్తున్న విద్యా ప్రేరణ తరగతులకు సంబంధించిన బ్రోచర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతా లోపం, జ్ఞాపకశక్తిలోపం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి వల్ల పరీక్షలంటే భయపడుతున్నారని తెలిపారు. సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియా, చెడు అలవాట్ల వల్ల చదువులో వెనుకబడి కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి మోటివేషన్ క్లాసులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు విన్నవించారు. శనివారం వారు మంత్రిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం వర్సిటీలో కాంట్రాక్ట్, ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మూడు ఏళ్లుగా జీతాలు రావడం లేదని, చాలా ఏళ్ల నుంచి బోధన, బోధనేతర ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వర్సిటీ ఆస్తుల పరిరక్షణకు వర్సిటీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించాలన్నారు. నగర పాలక సంస్థ నుంచి వర్సిటీకి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు.

హౌసింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న హనుమన్న

కర్నూలు(అర్బన్): గృహ నిర్మాణ సంస్థలో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న అవుట్ సోర్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. హనుమన్న కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2,500 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంబీసీ, అటెండర్ తదితర కేడర్లలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరందరికి టైంస్కేల్ వర్తింపజేయడం లేదా ఎస్‌ఎంఆర్‌లుగా ఉద్యోగాల క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు నేనావత్ రామునాయక్ మాట్లాడుతూ హౌసింగ్‌లో రెగ్యులర్ ఉద్యోగులు 90 శాతం మంది రిటైర్డు అయ్యారన్నారు. చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న వారిని అర్హతలను బట్టి ఆయా పోస్టుల్లో నియమించాలన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా తరహా విధానం రావాలి



ఆస్ట్రేలియాలో ప్రొఫెసర్ కంటే పీజీలకే సేవలందించినందుకు గాను డబ్బులు ఎక్కువగా వస్తాయి. ఆ విధానం భారత దేశంలో కూడా అమలు చేయాలి. ఇక్కడ పీజీ వైద్య విద్యార్థులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. వారికి కనీస వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదు. నిద్రపోయేందుకు కూడా వసతి లేకుండా చేశారు. వారు తిన్నారా, నిద్రపోయారా అని అడిగే నాథుడే లేరు. మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇచ్చేందుకు ఎన్‌ఎంసీ భవనాలు, వైద్యుల సంఖ్యను మాత్రమే చూస్తుంది గానీ పీజీల దుస్థితిని పరిగణలోకి తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి పీజీలకు పూర్తి స్థాయిలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలి

–డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, కర్నూలు



క్యాజువాలిటీల సంఖ్య పెంచాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకటే క్యాజువాలిటీ ఉంది. ఇందులోనే అన్ని రకాల కేసులు చికిత్స చేస్తున్నారు. అలా గాకుండా మెడిసిన్, సర్జరీ, గైనిక్, పీడియాట్రిక్స్, ట్రామా ఇలా వేటికవే క్యాజువాలిటీలను ఏర్పాటు చేస్తే పీజీలపై భారం, ఒత్తిడి తగ్గుతుంది. పీజీలకు సపోర్ట్‌గా ఉండేందుకు సీనియర్ రెసిడెంట్ల సంఖ్యను పెంచాలి. సీనియర్ డాక్టర్లు సైతం క్యాజువాలిటీ, ఐసీయూల్లో ఉంటూ పీజీలకు సూచనలు అందిస్తూ ఉంటే వారిపై ఒత్తిడి ఉండదు. పీజీలు పొద్దస్తమానం పనిచేయడానికే సరిపోతోంది. వారు చదువుకునేందుకు సమయం ఉండటం లేదు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి.అలాగే వైద్యులపై దాడులు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, రిటైర్డ్ టీబీ అధికారి, కర్నూలు

చూపు..చిరకాలం



సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు పెద్దలు. అలాంటి కళ్లను మనం మరణించాక మట్టిపాలు చేయకుండా దానం చేస్తే మరొకరి జీవితంలో వెలుగులు నింపుతాయి. మరో ప్రపంచాన్ని చూస్తాయి. మానవత్వంలోని మాధుర్యాన్ని, అత్యంత సుందర భావాలను దర్శిస్తాయి. ఈ నేపథ్యంలో నేత్రదానం ఆవశ్యకతపై జిల్లా అంధత్వ నివారణ సంస్థ అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. నేటి నుంచి వచ్చే నెల 8వ తేది వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తోంది.

- ఇరువురి జీవితాల్లో వెలుగు
- మూఢనమ్మకాలతో ముందుకు రాని కొద్దిమంది
- ఏటా 200 నుంచి 400 మంది నుంచి కనుగుడ్ల సేకరణ
- ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్‌లో నేత్ర మార్పిడి
- నేటి నుంచి వచ్చే నెల 8వ వరకు నేత్రదాన పక్షోత్సవాలు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వాలు, అధికారులు, వైద్యులు నేత్రదానంపై ప్రజలకు ఎంత అవగాహన కల్పిస్తున్నా ఇంకా మూఢనమ్మకాలు వీడటం లేదు. నేత్రదానం చేస్తే వచ్చే జన్మలో గుడ్డివారిగా జన్మిస్తారని, అందవిహీనంగా ఉంటారని నమ్ముతున్నారు. కొందరు మాత్రమే నేత్రదానికి ముందుకు వచ్చి వారి నేత్రాలను మట్టిలో కలిసిపోకుండా ఇతరులకు ఉపయోగపడేలా చేస్తున్నారు. కాగా ఇటీవల కాలంలో నేత్రదానికి ముందుకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇందులో భాగంగా ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా అధికారులు, టెక్నీషియన్లు సైతం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా, ఎవరైనా మరణించినట్లు ఆరు గంటల్లోపు సమీపంలోని కంటి సేకరణ కేంద్రం/ఐ బ్యాంక్(ఫోన్ : 08518–255575, సెల్ : 9849903116, 9640692299)కు వివరిస్తే వారు వచ్చి నేత్రాలను సేకరిస్తారు. అనంతరం వారికి కృత్రిమ నేత్రాలు అమర్చడం వల్ల ఎలాంటి అవయవ లోపం కనిపించదు. ఇలా సేకరించిన వాటిని హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపిస్తున్నారు. అక్కడ నేత్రాలు అవసరమైన వారికి వీటిని అమర్చి చూపును ప్రసాదిస్తున్నారు.

కార్నియా దానానికి అర్హులు

ఆడ, మగవారు ఏ వయస్సు వారైనా, ఏ ఆర్థిక స్థోమతలో ఉన్నా, చక్కెర, బీపీ, కొన్ని వ్యాధుల వల్ల చనిపోయిన వారు కూడా ఈ నేత్రదానానికి అర్హులు. కుక్కకాటుతో(రేబిస్ వ్యాధి), హెచ్ఐవీ/ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధితో చనిపోయిన వారి నేత్రాలు దానానికి పనికిరావు.

నేత్రాలను ఎలా సేకరిస్తారంటే...!

నేత్రదానం చేసే వారి కుటుంబసభ్యులకు ఎలాంటి ఛార్జీలు(ఫీజు) ఉండవు. ఈ నేత్రాలను ఉచితంగా వైద్యుల బృందం వెళ్లి వారి దగ్గరనే సేకరిస్తారు. ఈ నేత్రాలను వారి ఇళ్ల వద్ద కూడా సేకరిస్తారు. సేకరించిన కళ్లను విక్రయించడం, కొనడం కానీ జరగదు. ఈ నేత్రాలను ఉచితంగా ఇతరులకు అమరుస్తారు. మతగురువులు సైతం ప్రపంచమంతా నేత్రాదానాన్ని ప్రోత్సహిస్తున్నారు.

నేటి నుంచి జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలు

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8వ తేది వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించనున్నారు. 25న రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో అవగాహన కార్యక్రమాలు, 27న బస్టాండ్, కలెక్టరేట్, పాఠశాలల వద్ద కరపత్రాల పంపిణీ, 28న హుసేనాపురం పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం, 29న పీజీలు, వైద్యసిబ్బందికి కంటి ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం, 30న నేత్రదానంపై కర్నూలులో ర్యాలీ, 31న కంటి ఆసుపత్రిలో కెరటోప్లాస్టీపై అవగాహన కార్యక్రమం, 1వ తేది కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, పాఠశాలల్లో కరపత్రాల పంపిణీ, 2న కేవీఆర్ కాలేజిలో వ్యాసరచన పోటీలు, 3న విశ్వభారతి మెడికల్ కాలేజీలో అవగాహన కార్యక్రమం, 4న రేడియోలో కార్యక్రమం, 5న ఎన్‌జీవోల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, 6న నర్సింగ్ విద్యార్థులకు, రెడ్‌క్రాస్ ఆప్టోమెట్రి స్టూడెంట్స్‌కు నేత్రదానంపై అవగాహన, 8న పక్షోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జిల్లాలో నేత్రదానం చేసిన వారి సంఖ్య

సంవత్సరం	నేత్రదానాల సంఖ్య
2015-2016	175
2016-2017	373
2017-2018	368
2018-2019	349
2019-2020	377
2020-2021	176
2021-2022	264
2022-2023	412
2023-2024	488
2024-2025 ఇప్పటి వరకు	162

నేత్రదానానికి ముందుకు రావాలి



నేత్రదానానికి వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం కంటి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చాలా మంది ఇంకా అపోహలు, మూఢనమ్మకాలతో నేత్రదానం చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. నేత్రదానం సమయంలో మొత్తం కన్ను గాకుండా నల్లగుడ్డు(కార్నియా) మాత్రమే తీస్తారని, దాని స్థానంలో కృత్రిమ కళ్లను అమర్చడం వల్ల వారికి ఎలాంటి అవయవలోపం కనిపించదన్నారు. మరణించిన వ్యక్తి సమాచారాన్ని ఆరు గంటల్లోపు సమీపంలోని కంటి సేకరణ కేంద్రానికి ఇస్తే వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

31లోగా ఏపీఏఏఆర్ పూర్తి చేయాలి

- రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ బ్యాంక్ క్రెడిట్స్ (ఏబీసీ), ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్)ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. వర్సిటీలోని సెనేట్ హాలులో వర్సిటీ అనుబంధ డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లకు ఏపీఏఏఆర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ అన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి విశ్వవిద్యాలయానికి సహకరించవలసిందిగా కళాశాలల యాజమాన్యాలకు సూచించారు. వర్సిటీ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ప్రతి ఒక్క విద్యార్థికీ ఈ ఏబీసీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా సూచించారు. డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య సుందరానంద్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను పీపీటీ సహాయంతో వివరించారు. వర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాదరెడ్డి మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసే విధానాన్ని యాజమాన్యాల ప్రతినిధులకు వివరించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రీసర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్‌తో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని శిక్షించాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాదానికి యాజమాన్యమే కారణమని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ అంశంపై శనివారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో కార్మికుల కనీస భద్రతను యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం కూడా యాజమాన్యానికి వంత పాడటంతో ప్రమాదంలో 17 మంది కార్మికులు మృతి చెందినట్లు చెప్పారు. ఈ ఘటనపై ప్రభుత్వం అత్యున్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ దేశాయ్, ప్రభాకర్, సుధాకరప్ప, మహ్మద్, హుస్సేన్‌వలి, మాలిక్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): సమాజంలోని ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్. భాస్కర్, సెట్కూరు సీఈఓ పీవీ రమణ కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం కర్నూలు నగరంలో మారథాన్ రన్ (5 కిలోమీటర్ల పరుగు) నిర్వహించారు. ఈ పోటీలను కోల్స్ కాలేజ్ వద్ద పచ్చజెండా ఊపి ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. కాలేజి విద్యార్థినీ విద్యార్థులు హెచ్ఐవీ పట్ల సమగ్ర అవగాహన కలిగి ఉండి, తమ తోటి వారికి చైతన్యం చేయాలని కోరారు. జిల్లా కుష్ఠు నివారణాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీ సంక్రమించే మార్గాల గురించి వివరించారు. కార్యక్రమం అనంతరం మారథాన్ విజేతల వివరాలు ప్రకటించారు. పురుషులలో 1. ఎ. దివాకర్ (ఎస్ఆర్ డిగ్రీ కాలేజి), 2. జి. ప్రసాద్ (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), మహిళల్లో 1. మల్లికాబాయ్ (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), 2. డి. వెంకటేశ్వరి(రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాల), ట్రాన్స్‌జెండర్లలో జి. లీలావతి, జి. కీర్తి ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. భూపతి, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జి. వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ఆర్‌యూలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, వర్సిటీ వైస్‌చాన్సలర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: పర్యావర పరిరక్షణ అందరి బాధ్యత అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సువిశాలమైన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వర్సిటీ వీసీ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, బోధన, బోధనేతర ఉద్యోగులతో మొక్కలు నాటించామన్నారు. ప్రధాన మంత్రి పిలుపు మేరకు అమ్మకు గుర్తుగా ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పరిరక్షించాలన్నారు. అంతరించిపోతున్న సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.నరసింహులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఆర్‌యూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరి ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కేవీ రత్నం, డాక్టర్ బి.విజయ్, డాక్టర్ ఎస్.నాగ చంద్రుడు, బీవీ శివ ప్రసాద్, గాయత్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు జిల్లాలో కృష్ణుని జయంతి వేడుకలు జరుగనున్నాయి. నగరంలో ఇస్కాన్, చిన్మయ మిషన్, గో సంరక్షణ శాల, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, నంద్యాల చెక్‌పోస్ట్ శ్రీకృష్ణ ఆలయం, చిన్మయ మిషన్, లలితా పీఠం, సూర్యనారాయణ స్వామి, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో వేడుకల నిర్వహణకు ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు చేశారు. నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు గోమాత పూజ, భజన, భగవద్గీత పారాయణం, రాత్రి 12 గంటలకు శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు, లాలిపాటలు, 26వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు శ్రీకృష్ణ రుక్మిణి మాత అభిషేకం, పూజా వేడుకలు, 10 గంటలకు కలెక్టరేట్ నుంచి కృష్ణమందిరం వరకు శ్రీకృష్ణుని చిత్ర పటంతో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాశీభట్ల సంతాప సభ

కర్నూలు కల్చరల్ : ప్రముఖ కవి కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభను ఆదివారం ఉదయం 10 గంటలకు మద్దూర్ నగర్ పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ కవులు జి.వెంకటకృష్ణ, అనంత్ చింతలపల్లి, చంద్రశేఖర్, ఎం.దయానంద్ హాజరుకానున్నట్లు వెల్లడించారు.

మెడికల్ క్యాంపులు సంతృప్తినిస్తున్నాయి

కర్నూలు(హాస్పిటల్): పేదరోగుల కోసం ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపులు తనకు ఎంతో సంతృప్తినిస్తున్నాయని ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ పి. సుధాకర్‌రావు చెప్పారు. సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో రోజావీధికి చెందిన పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. శనివారం వారిని డిశ్చార్జ్ చేస్తూ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

కర్నూలు (టౌన్): నగరపాలకలో హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని నగరపాలక కార్యాలయ మేనేజర్ చిన్నరాముడు స్పష్టం చేశారు. శనివారం నగరపాలకలోని ఫిర్యాదుల స్వీకరణ విభాగాన్ని మేనేజర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మూడు నెలలుగా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ మూడు నెలల్లో హెల్ప్‌లైన్, వాట్సాప్ ద్వారా మొత్తం 628 సమస్యలు రాగ 528 సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. హలో కేఎంసీ కార్యక్రమానికి తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

మనోభావాలు దెబ్బతింటే ఊరుకోం

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, తమ మనోభావాలు దెబ్బతింటే సహించమని బీజేపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ సద్దల మధు కిషోర్ అన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆయన శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం అన్న విషయాన్ని మరువరాదన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం పసుపలలోనే కూటమి ధర్మం అమలు కాకపోతే మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చునన్నారు. ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించిన గ్రామ సభలకు ఎక్కడా కూడా బీజేపీ నాయకులను పిలవడం లేదని చెప్పారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం


డబుల్ క్రౌన్ సాధించిన మున్సిపల్ ఉన్నత పాఠశాల బాల బాలికల జట్టు

కర్నూలు (టౌన్) : క్రీడల్లో రాణించే వారికి తమ వంతుగా ప్రోత్సాహం అందిస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ, బాస్కెట్ బాల్, ఖో-ఖో,స్కేటింగ్, వెయిట్ లిఫ్టింగ్, యోగ, సెపక్‌తక్రా వంటి క్రీడాంశాల్లో అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడలకు సహకారం అందిస్తుందన్నారు.

విజేత జట్లు ఇవే

హాకీ పోటీల్లో మున్సిపల్ ఉన్నత పాఠశాల బాల బాలికల జట్లు డబుల్ క్రౌన్ సాధించాయి. మహిళల విభాగంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు 2–0 గోల్స్ తేడాతో గార్గేయపురం జట్టుపై విజయం సాధించాయి. అలాగే బాలుర హాకీ పోటీల్లో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టుకు మూడవ స్థానంలో నిలిచింది. కాగ మొదటి, రెండు స్థానాల్లో మునగాల పాడు, ఇండస్ స్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే యోగ క్రీడాంశంలో చిన్నారులు పలు విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో సెట్కూర్ సీఈఓ రమణ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, యోగ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రగ్బీ పోటీలు

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం 12 సంవత్సరాలలోపు బాల బాలికలకు రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు స్పష్టం చేశారు.

స్టేడియంలో అభివృద్ధి పనులకు సహకరించండి

కర్నూలు (టౌన్): స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు సహకరించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు శనివారం స్థానిక మౌర్య ఇన్‌లో మంత్రి టీజీ భరత్‌ను కలిసి విన్నవించారు. స్టేడియంలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్, ఫుట్‌బాల్ మైదానంలో పచ్చిక మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీకోవాలన్నారు. క్రీడాకారుల వసతి కోసం అదనంగా ఫ్లోర్ నిర్మాణం చేపట్టాలన్నారు.

రేపు చిన్ని కృష్ణుల వేషధారణ పోటీలు

కర్నూలు కల్చరల్: భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు మండలి అధ్యక్షురాలు పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండలి కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఆదివారం సాయంత్రం 3 నుంచి 6 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94925 50433, 99665 15684 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యులు జయలక్ష్మి, స్వప్న, శ్రీదేవి, అనురాధ, మహాలక్ష్మి, కృష్ణవేణి, హేమలత, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయాలు తెలియజేయాలి

కర్నూలు సిటీ: కృష్ణానగర్‌లోని సర్వేపల్లి విద్యా సంస్థల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆ స్కూల్ అధినేత పి.శేషన్న ఈ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు సంస్కృతులు, సంప్రదాయాల గురించి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడతాయన్నారు. వేడుకల్లో చిన్ని కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో పిల్లలు ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టేందుకు పిల్లలు పోటీ పడ్డారు.